# రాములవారి ఏకాంత సేవ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలో వెలిసిన శబరి శ్రీరామ క్షేత్రంలో మంగళవారం ఉదయం 9 గంటలకు రాముల వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం బ్యాండు కచేరీ, ఏకాంత సేవ, రాత్రి పల్లకిసేవ అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశా రు. ఉభయకర్తలుగా అన్నం దయాకర్ గౌడ్, సుబ్బరత్నమ్మ దంపతులు వ్యవహరించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు విశేషంగా పాల్గొన్నారని ఆలయ అర్చకులు తెలిపారు.


నేటి దినపత్రిక

# సూర్య

18 వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం | 16 ఏప్రిల్ 2025 | పేజీలు 8


# పిరికిపంద.. కాకాణి పారిపోయాడు




**అంతర్ జాతీయ నేరస్తులు దొరుకుతున్నారు..**
**కాకాణి దొరకడం లేదు !**
**కాకాణి అరెస్ట్ గురించి నిప్పులు చెరిగిన సోమిరెడ్డి**

**నెల్లూరు, మేజర్‌న్యూస్ బ్యూరో :**

కరోనా విపత్తు సమయంలో ఆనందయ్య ఆయుర్వేదం మందును వెబ్‌సైట్ ద్వారా అమ్మకానికి ఉంచిన నర్మదారెడ్డి తనపై పెట్టిన కేసుకు సంబంధించి మంగళవారం కోర్టుకు హాజరైన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసు విచారణ వచ్చే వారానికి వాయిదా పడిందన్నారు. అప్పట్లోనే ఆనందయ్యతో పాటు ఆయన కుమారుడు తాము ఆయుర్వేదం మందుకు అమ్మకానికి పెట్టలేదని, ఆ వెబ్ సైట్‌తో సంబంధం లేదని ఖండించారన్నారు. తనపై నర్మదారెడ్డి చేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృష్ణపట్నం పోర్టు స్టేషన్‌లో కేసు పెట్టించారన్నారు. ఇటువంటివి తనపై 18 కేసులు ఉన్నాయని, వాటిలో ఒక కేసును హైకోర్టు క్వాష్ చేసిందన్నారు. తనపై బనాయించిన అక్రమ కేసుల విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తే ఇక్కడ కాకాణి నన్ను దరిద్రుడా, అష్ట దరిద్రుడా అని తిట్టాడన్నారు. మొన్న క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో అరెస్టు భయంతో నెల్లూరు నుంచి పరారైన తర్వాత హైదరాబాద్‌లో ఓ మీడియాతోనూ అదే విధంగా మాట్లాడాడన్నారు. ఏదో కొంప మునిగిపోయిందని ప్రెస్‌మీట్ల మీద ప్రెస్‌మీట్లు పెడుతున్న వైసీపీ ఇన్‌చార్జిలకు, ఎంపీ, ఎమ్మెల్సీలకు సమాధానంగా ఈ విషయాలు చెబుతున్నానన్నారు. ఆనందయ్య ఆయుర్వేదం మందును అమ్మకానికి పెట్టిన సమయంలో నేను మాట్లాడిన ప్రెస్‌మీట్ వీడియో మీడియా ప్రతినిధులందరి దగ్గర ఉంది.. నేను ఏమైనా తప్పు మాట్లాడానా.. చూడాలన్నారు. ఆరోజు నా తల్లిని, తండ్రిని దూషించాడన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి, మిగిలిన వైసీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలందరికీ నేను ఒక్క మాట చెబుతున్నా.. కాకాణి వాడే భాషనే మీపై వాడిస్తా.. నేనైతే ఆ భాష మాట్లాడలేను.. మా నాయకుల్లో ఎవరో ఒకరి చేత మాట్లాడిస్తా.. మీ తల్లిదండ్రులను తిడతారు.. ఆయన వాడే దరిద్రుడు వంటి పదాలను వాడుతారు.. అప్పుడు కూడా మీరు చప్పట్లు కొడతారా ! అని ప్రశ్నించారు. ఇటువంటి భాషతో తాము హ్యాపీ అని మీరు మెసేజ్ పెడతారా.. ఇటువంటి భాష వాడండని అందరికీ చెబుతారా అన్నారు. పబ్లిక్ లైఫ్‌లో ఉండేటప్పుడు కొంచెమైనా సిగ్గుండాలి.. ఒక పనికిమాలినోడ్ని, ఒక దోపిడీదారుడిని వెనకేసుకొస్తారా అన్నారు. క్వార్ట్జ్ అక్రమ రవాణా చేస్తే తప్పుడు కేసు అని మాట్లాడుతారా, కాకాణి సొంత మండలం పొదలకూరు, సొంతూరు తోడేరు పక్కనే వరదాపురం.. అక్కడ పట్టపగలే భారీ దోపిడీ చేశారన్నారు. మైనింగ్ లీజు లేకుండా 14 ప్రొక్లెయిన్లు, 30 డంపర్లు, ఒక గోదాముతో పాటు మరో ట్రక్కులో ప్రమాదకర పేలుడు పదార్థాలు, వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ అక్రమ తవ్వకం.. ఇవన్నీ కాకాణికి తెలియదంటారా అని ప్రశ్నించారు. రెండు బస్సుల్లో హిజ్రాలు, మరో రెండు బస్సుల్లో రౌడీలు వచ్చిన సంగతి కూడా కాకాణికి తెలియదు.. మీకు అసలే తెలియదన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి ఒక బుద్ధిమంతుడు అని మీరందరూ చెబుతారా చెప్పండన్నారు. వదరాపురం రుస్తుం మైన్‌లో అక్రమంగా తవ్విన క్వార్ట్జ్‌ని తోడేరులో నిల్వ చేశారనే విచారణలో తేలిందన్నారు. అది కూడా కాకాణికి తెలియదని మీరు సెలవిస్తారా చెప్పాలన్నారు. అప్పట్లో మంత్రి అయిన కాకాణి గోవర్ధన్ రెడ్డికి తోడేరులో క్వార్ట్జ్ అక్రమంగా నిల్వ చేసిన విషయం తెలియదని, ఆయన ఏ పాపం ఎరుగడని మీరు చెబుతున్నారు.. అటువంటి వ్యక్తిని జిల్లా అధ్యక్షుడిగా ఎలా పెట్టుకున్నారు.. అతన్ని ఆ స్థానంలో కూర్చోపెట్టుకున్నందుకు మీరు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. నేను మగోణ్ణి, పోలీసు కేసులకు అదరను, బెదరను అనే కాకాణి ఈ రోజు ఎక్కడికి పోయాడన్నారు. తప్పు చేశాడు కాబట్టే పిరికి పందలా పారిపోయాడన్నారు. గతంలోనూ విదేశాల్లో నాకు ఆస్తులున్నాయని నకిలీ పత్రాలు సృష్టించి ఊరు వదిలి ఉడాయించాడన్నారు. కట్టుకున్న లుంగీతో రెండు నెలలు కనిపించకుండా పోయి సుప్రీంకోర్టుకు వెళ్లి కండిషన్ బెయిల్ తెచ్చుకున్నాడన్నారు. రోజూ నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి కానిస్టేబుల్ వద్ద రెండు నెలలు సంతకం పెట్టివచ్చాడన్నారు. కాకాణిని పట్టుకోవడం కోసం ఆరు పోలీసు బృందాలు పనిచేస్తున్నాయంట.. ఎక్కడా కనిపించడం లేదంట.. ఇటువంటి మోసగాళ్లు, తప్పులు చేసి పారిపోయే పిరికి పందలు, పట్టపగలు దోపిడీ చేసే దొంగల గురించి మీరు రోజుకొక స్టేట్మెంట్ ఇస్తారా అన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చాలా బుద్ధిమంతుడిగా కనిపిస్తున్నాడంట.. చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఒక బుద్ధిమంతుడు కదా.. కాబట్టే ఆయనకు అలాగే కనిపిస్తున్నాడేమో అని పేర్కొన్నారు. మీకు సిగ్గు, శరం, దమ్ము ఉంటే కాకాణిని తీసుకొచ్చి పోలీసుల

-మిగతా 2లో

## నేడు బాధ్యతలు స్వీకరించనున్న
# జిల్లా జడ్జి శ్రీనివాస్



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.శ్రీనివాస్ బుధవారం నాడు పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. 2012లో న్యాయమూర్తిగా న్యాయశాఖలో ప్రవేశించిన న్యాయమూర్తి శ్రీనివాస్ 2022 నుంచి అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి అనంతరం నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో న్యాయ వాదుల కోర్టు సిబ్బంది సహకారంతో న్యాయమూర్తి శ్రీనివాస్ విశేష కృషి చేసిన వారిగా పేరు తెచ్చుకున్నారు.

## ప్రమాదాల నివారణకు త్వరితగతిన
# సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



**అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ కార్తీక్**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదా ల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఆర్ అండ్‌బి ఎస్‌ఈ గంగాధర్ కమిటీ సభ్యులకు వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను ప్రధాన కూడళ్లు, కళాశాలలు, హైస్కూల్‌లలో చేపడుతున్నట్లు చెప్పారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా ఏసి కూరగాయల మార్కెట్ సెంటర్, జిల్లా పోలీసు కార్యాలయం సెంటర్, కెవిఆర్ జంక్షన్, కనక మహల్ సెంటర్, రామలింగాపురం, విఆర్‌సి ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మే నెల మొదటివారంలోగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఏర్పాటుచేసిన సిగ్నల్స్ వ్యవస్థలోని లోటుపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా పకడ్బందీగా సిగ్నల్

-మిగతా 2లో

# బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వేర్వేరు ఘటనలలో గాయపడ్డ బాధితులను పరామర్శించేందుకై నెల్లూరు నారాయణ హాస్పిటల్‌కు విచ్చేశారు. విడవలూరులో అంబేద్కర్ జయంతి సందర్భంగా బాణాసంచా కాలుస్తూ ప్రమాదవశాత్తు గాయపడి నారాయణ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న శ్యాం అనే యువకుడ్ని ఆమె పరామర్శించారు. బుచ్చిరెడ్డి పాళెంలోని బాంబే రోడ్డుపై పారిశుధ్య విధులు నిర్వహిస్తూ.. లారీ ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి నెల్లూరు నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శానిటేషన్ ఉద్యోగి కర్రా దశయ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విడవలూరుకు చెందిన శ్యాం, బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి చెందిన కర్రా దశయ్యలకు మెరుగైన వైద్య చికిత్సలు అందివ్వాల్సిందిగా ఆమె డాక్టర్లను సూచించారు. బాధితులకు ఏ అవసరమొచ్చినా తాను ఆదుకుంటానని ఆమె బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్యే ప్రశాం తిరెడ్డితో పాటు బుచ్చి కమీషనర్ బాలకృష్ణ, ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టిడిపి నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణా౽రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజ స్తంభ పునర్నిర్మాణం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలో వెలిసిన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం విమాన జీవద్వజ జీర్ణోద్ధార సంబంధించి ధ్వజస్తంభ పునః నిర్మాణం, సాలహార నిర్మాణం, నవగ్రహ మండపం పునఃనిర్మాణం, దేవస్థానానికి స్తంభ వర్గములు ఏర్పాటు చేయు ట, దక్షిణము వైపు ప్రహరీ గోడ జరిపి నిర్మించుటకు శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి పీఠాధిపతుల వారి ఆదేశానుసారం వారి ఆస్థాన సిద్ధాంతి అయిన లక్కవజ్జుల విజయ సుబ్రహ్మణ్యం సిద్ధాంతి వారి అర్చక బృందం, దేవస్థానం ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి వివిధ కార్యక్రమాలతో భాగంగా గణపతి పూజ, పునహ్వాచనం, వేద స్వస్తి, యాగశాల ప్రదేశం, గోపూజ మూల మంత్ర జప అనుష్టాకులు వాస్తు పర్యగ్రీకరణ, అంకురార్పణ కార్యక్రమాలు జరిగాయి. దాతలుగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సులోచన, ఆల్తూరు గిరీష్ కుమార్‌రెడ్డి లత, ఆల్టూరు మహేష్ రెడ్డి రాధిక, ఏఎన్ఆర్ ఇండియా లిమిటెడ్ అండ్ ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ వారు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి కోవూరు జనార్దన్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

# పిరికి పంద.. కాకాణి పారిపోయాడు

*(మొదటి పేజీ తరువాయి)*

నోటీసులకు సమాధానం ఇప్పించండి.. తప్పు చేయకపోతే వచ్చి సమాధానం చెప్పించండన్నారు. వరదాపురం రుస్తుం మైన్, మొగళ్లూరు, ముదిగేడు, మరుపూరులో కాకాణికి తెలియకుండానే క్వార్ట్జ దోపిడీ జరిగిందని చెబుతారా.. అసలు మీరు ఏం మాట్లాడుతున్నారో మీకైనా అర్థం అవుతుందా అని ప్రశ్నించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన పాపాలకు ఫలితం అనుభవిస్తున్నాడని, పోలీసులకు చిక్కకుండా పారిపోతే, ఎలాంటి నరకప్రాయమైన పరిస్థితులు ఎలా ఉంటాయో.. నా స్నేహితుడు చెబితే విన్నానన్నారు. భార్యాపిల్లలు, స్నేహితులతో మాట్లాడకుండా, ఫోన్ వాడకుండా, డెబిట్, క్రెడిట్ కార్డులు వాడకుండా, ఏ వైపు నుంచి శబ్దం వచ్చినా నిద్రపట్టక నరకం అనుభవించానని చెప్పాడన్నారు. పారిపోవడం కన్నా.. జైలుకు వెళ్లడమే మేలనిపించిందన్నాడు. అటువంటి నరకాన్ని ఈరోజు కాకాణి అనుభవిస్తున్నాడన్నారు. ఇడిమేపల్లి భూములకు సంబంధించి నాపై మొదటి కేసు పెట్టించారు. పోలీసులు నోటీసులిస్తే వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యాను. నేనిచ్చిన డాక్యుమెంట్లు చూసి పోలీసులు నోరు తెరుచుకున్నారు. నన్ను విచారిస్తుండగానే పోలీసులకు ప్రతి 10 నిమిషాలకు ఒకసారి ఫోన్ చేశాడు. అరెస్ట్ చేయమని పదేపదే చెప్పాడన్నారు. కానీ పోలీసులు ఆ సాహసం చేయలేదు. ఎందుకంటే నేను ఏ తప్పూ చేయలేదన్నారు. నర్మదరెడ్డితో పెట్టించిన రెండో కేసులోనూ నేను పారిపోలేదు. జిల్లా టీడీపీ ఆఫీసులో కూర్చుని ప్రెస్‌మీట్ పెట్టి సవాల్ విసిరానన్నారు. హైకోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చుకునే ఓపిక నాకు లేదు. వచ్చి అరెస్ట్ చేసుకోమని చెప్పాను. పోలీసులను పంపించమని కాకాణి కూడా సూచించానన్నారు. నేను ఏ తప్పు చేయకుండానే ఈరోజు కోర్టుల చుట్టు తిప్పుతున్నాడన్నారు. కాకాణికి మాత్రం పోలీసుల విచారణకు హాజరయ్యే దమ్ము లేదు. అటువంటి పనికిమాలినోళ్లని జగన్మోహన్ రెడ్డి మంత్రులుగా, జిల్లా అధ్యక్షులుగా నియమించుకోవడం సిగ్గుచేటన్నారు. ఈరోజు కాకాణి గోవర్ధన్‌రెడ్డి 11 నియోజకవర్గాలకు నాయకుడంట. ఈయన్ని చూసి అందరూ నేర్చుకోవాలేమో.. నెల్లూరు జిల్లాలోని వైసీపీ నాయకులందరూ కాకాణి మాదిరిగా దోపిడీలు, దొంగతనాలు, పనికిమాలిన పనులు, తప్పుడు పనులు చేసి పారిపోవడం ఫాలో అవ్వాలేమో, ఇలాంటి వ్యక్తిని జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు జగన్మోహన్ రెడ్డికి సిగ్గుండాలన్నారు.

మా తల్లిదండ్రుల గురించి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడిన రోజే జగన్ రెడ్డి చెప్పుతో కొట్టి ఉండాలన్నారు. నిన్న వైఎస్ భారతి గురించి ఒకరు అసభ్యంగా మాట్లాడితే మా నాయకులు ఎత్తి లోపల వేయించారని గుర్తు చేశారు. ఆ పనిని జగన్ రెడ్డి ఎప్పుడో చేయించుండాలి.. వల్లభనేని వంశీ, కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడిన సమయంలో ఆ పని చేసుండాలన్నారు. అసెంబ్లీలో ఆ పనికిమాలినోళ్లు అసభ్యంగా మాట్లాడుతుంటే జగన్ రెడ్డి నవ్వుతూ.. ఎగురుతూ.. కులుకుతూ కూర్చున్న జగన్మోహన్ రెడ్డికి ఈరోజు 11 సీట్లు వచ్చే గతి పట్టిందన్నారు. తల్లిదండ్రుల గురించి కాకాణి మాట్లాడిన రోజే జగన్ రెడ్డి ముఖం మీద కొట్టి చర్యలు తీసుకునేవుంటే ఇంకో నాలుగు సీట్లు అయినా వచ్చుండేవ న్నారు. వైసీపీ అంతం కావడానికి కారణం జగన్మోహన్ రెడ్డి ఇలాంటి వారిని సమర్థించడమేనన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి పారిపోవడంలో అత్యంత సమర్థులు.. ఈమాట ఎలా చెప్పగలుతున్నానంటే, పంజాబ్ నేషనల్ బ్యాంకులో 13 వేల కోట్లు మోసం చేసిన మెహుల్ చోక్సీని బెల్జియంలో అరెస్ట్ చేశారన్నారు. ముంబై పేలుళ్ల కేసులో నిందితుడైన తహవూర్ రాణా ను అమెరికాలో అరెస్ట్ చేశారన్నారు. అంతర్జాతీయ నేరస్థులు దొరికినా.. కాకాణి గోవర్ధన్ రెడ్డి దొరకడం లేదంట అని పేర్కొన్నారు. పోలీసుల కళ్లు గప్పి పారిపోవడం, తప్పించుకుని తిరగడంలో అంతర్జాతీయ స్థాయిలో కాకాణి నెంబర్ 1గా నిలిచారన్నారు. బెల్జియం, అమెరికాలో ఉన్న వాళ్లు దొరుకుతున్నా.. ఈయన మాత్రం చిక్కడం లేదన్నారు. కాకాణి ఈ విద్య ఎక్కడ నేర్చుకున్నాడో.. ఏ స్కూలులో ట్రైనింగ్ తీసుకున్నాడో, ఆయన ట్రైనర్, బ్యాక్ గ్రౌండ్ ఎవరో.. జగన్మోహన్ రెడ్డి అయినా అరెస్ట్ అయి జైలుకెళ్లాడు. కాకాణి మాత్రం దొరకడం లేదన్నారు. పోలీసులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విదేశాలకు పారిపోతాడనే అనుమానంతో లుక్ అవుట్ నోటీసు కూడా ఇచ్చారన్నారు. తప్పులు చేసి పారిపోవడంలో అత్యంత చాణక్యుడు, చాకచక్యం కలిగిన వాడు కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తి నెల్లూరు జిల్లా రాజకీయాల్లో ఉండటం మనందరి ఖర్మ అని.. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

# ప్రమాదాల నివారణకు త్వరితగతిన సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి : జాయింట్ కలెక్టర్ కార్తీక్

*(మొదటి పేజీ తరువాయి)*

పాయింట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో ఇంకా సిగ్నల్ పాయింట్లు అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేయాలని సూచించారు. బుజబుజ నెల్లూరు నుంచి కోవూరు వరకు గల జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న 11 ప్రాంతాల్లో సోలార్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. అలాగే జాతీయ రహదారిపై వాహనదారులు విశ్రాంతి తీసుకునేందుకు మనుబోలు సమీపంలో సర్వేల్యాండ్ రికార్డుల అధికారి కొన్ని ప్రదేశాలను ఎంపిక చేశారని, వీటిలో ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసి వాహనదారుల విశ్రాంతి కోసం అన్ని మౌలిక వసతులతో ఏర్పాట్లు చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రహదారుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెయింటింగ్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పొదలకూరు రోడ్డు వద్ద డివైడర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారిపై మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రద్దీ ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇతర ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులను రోడ్లపై వదలకుండా చూడాలని, పశువులకు రేడియం స్టిక్లర్లను ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. జాతీయ రహదారులతో కలిసే పంచాయతీరాజ్ రహదారుల వద్ద ప్రమాదాల నివారణకు 52 ప్రాంతాల్లో భద్రతా చర్యల కోసం రూ.168 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు జేసీకి వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిలో 33 ముఖ్యమైన ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా భద్రతా చర్యలు చేపట్టేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే ఆర్అండ్‌బికి సంబంధించి ప్రమాదభరిత ప్రాంతాల్లో 120 లక్షలతో భద్రతా చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్అండ్‌బి ఎస్ఈ తెలిపారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో 3200 లైట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలుపగా, ఇంకా అవసరమైన ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటుచేయాలని అధికారులను జేసీ ఆదేశించారు. వార్డుఅమెనిటీ సెక్రటరీల ద్వారా సర్వే చేయించి అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ధనలక్ష్మీపురం వద్ద డివైడర్ బ్రేక్ వచ్చిన ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు ఏర్పాటుచేయాలన్నారు. హిట్ అండ్ రన్ కేసులను త్వరగా పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరంలో 390 సిసి కెమెరాలు పని చేస్తున్నాయని మున్సిపల్ అధికారులు తెలుపగా, వీటిని నిరంతరం పర్యవేక్షించేందుకు పోలీసుకంట్రోల్‌రూంకు అనుసంధానం చేయాలని సూచించారు.

ఈ-డార్ ఆన్‌లైన్ సిస్టంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని, అన్ని హాస్పిటల్స్‌లో ఇందులో నమోదయ్యేలా చూడాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు జేసీ సూచించారు. ఈ డేటా ఆధారంగా ఏ ప్రదేశంలో ఎక్కడా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేసేందుకు హైవే సమీపంలోని శ్రీ వేణుగోపాలస్వామి కాలేజీని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇందుకు దేవాదా య శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు.

అలాగే మద్రాసు బస్టాండు నుంచి కలెక్టరేట్ వరకు వాహనదారులు ఇష్ట ప్రకారం పార్కింగ్ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, దీనికి పరిష్కార మార్గం చూపుతూ పూర్తి వివరాలను వచ్చే సమావేశంలో తెలపాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ ప్రదేశాల్లో పార్కింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించాలన్నారు. అధికారులందకూ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఈ సందర్భంగా జేసీ పిలుపునిచ్చారు. సమావేశంలో నెల్లూరు, ఒంగోలు ఎన్‌హెచ్ఎ పిడిలు ఎంకె. చౌదరి, విద్యాసాగర్, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, మున్సిపల్ ఎస్ఈలు రామ్మోహన్‌రావు, జానీ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ యాక్టివిస్ట్‌లపై చర్యలు తీసుకోవాలి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి పోలీసులను కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లు సీమరాజా అలియాస్ చంద్రకాంత్ చౌదరి, యాష్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు మంగళవారం మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రజలకు జనరంజక పాలన అందించారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసు బనాయించి వారిని ఇబ్బందులు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే తెలుగుదేశం పార్టీ ఇలాంటి ఆకృత్యాలు పాల్పడుతుందని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏడాది కాలం అస్తవ్యస్త పాలనతో ప్రజలను ఇబ్బందికి గురి చేస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనని వాటిని డైవర్ట్ చేసేందుకు టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ల చేత ఈవిధమైన దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. ముఖ్యంగా టీడీపీ సోషల్ మీడియా



యాక్టివిస్ట్‌లు సీమ రాజా అలియాస్ చంద్రకాంత్ చౌదరి, యాష్ వీరిద్దరూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై సోషల్ మీడియా వేదికగా డిబేట్లు, నిర్వహిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ కార్యకర్తల మనోభావాలను కించపరుస్తున్నారని తెలిపారు. వారి ఇరువురిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామని పోలీసులు ఈ విషయంలో చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్‌ను సందర్శించిన న్యాయమూర్తులు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** కడప జిల్లా జడ్జిగా బదిలీ అయిన నెల్లూరు జిల్లా జడ్జి డాక్టర్ సి.యామిని మంగళవారం నెల్లూరు బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. బార్ అసోసియేషన్ హాల్లోకి వచ్చిన జిల్లా జడ్జి యామినికి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బారసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఎం.సుందరయ్య యాదవ్, పలువురు సీనియర్ న్యాయవాదులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన పదవీకాలంలో విధి నిర్వహణలో సహకరించిన నెల్లూరు న్యాయవాదులకు జిల్లా జడ్జి యామిని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా జడ్జి యామినితో పాటు గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జిగా బదిలీపై వెళ్తున్న నెల్లూరు ఫ్యామిలీ కోర్టు జడ్జి వెంకట నాగపవన్ కూడా నెల్లూరు బార్ అసోసియేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో తనకు సహకరించిన న్యాయవాదులకు న్యాయ మూర్తి కృతజ్ఞతలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న ఇద్దరు జిల్లా న్యాయమూర్తులు నెల్లూరు బార అసోసియేషన్ సందర్శిం చడంతో బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు సంతోషం వ్యక్తం చేశారు బదిలీపై వెళుతున్న న్యాయమూర్తులకు ఘనంగా న్యాయవాదులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో న్యాయ వాదులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాపాడండి : కాటేపల్లి గ్రామస్తుల ఆవేదన

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం కాటేపల్లి గ్రామ ప్రభుత్వ భూములను కాపాడుతూ పశువులకు మేత నీరు నీడ కల్పించే విధంగా రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని ఆ గ్రామస్తులు తెలియజేస్తున్నారు. మంగళవారం సర్పంచ్‌తో కలిసి కాటేపల్లి గ్రామస్తులు తహసిల్దార్ కార్యాలయానికి చేరి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రంలో కాటేపల్లి గ్రామంలో 277, 278 సర్వే నంబర్లు యందు కొందరు గ్రామస్తులు కాటేపల్లి ఎంపీటీసీ సభ్యుడు పల్లా పురుషోత్తంవారి కుమారుడు పల్లా మధు ఐదవ వార్డు సభ్యురాలుపల్లా విజయలక్ష్మి భర్త పల్లా వెంకటేశ్వర్లు ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రొక్లైన్ సహాయంతో చెట్లను తొలగిస్తూ చదును చేసుకుంటూ ఉన్నారు. దీనివల్ల పశువులకు నీరు మేత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల తొమ్మిదవ తేదీన కొంత భూమిని 13వ తేదీన మరికొంత భూమిని చదును చేసుకుంటూ ఉన్నా ప్రభుత్వం అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు పట్టించుకోవడం లేదన్నారు. వీఆర్ఏ వీఆర్వోలకు విషయాన్ని తెలియజేసిన నిమ్మకు నీరు ఎత్తినట్లుగా ఉన్నారు అన్నారు. ఆ విషయంపై కాటేపల్లి గ్రామస్తులు వెనక పత్రాన్ని అందజేసిన ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం అందులోని చెట్లను తొలగించడం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల కలెక్టర్, కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని వారు



తెలియజేశారు. ప్రభుత్వ సంపదను దోచుకుంటున్న అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అవును ఇప్పటికైనాను రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూమిని పరిశీలించి అందులో తొలగించి ఉన్న చెట్ల విలువను ధర నిర్ణయించి పంచాయతీకి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటూ వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని లేనియెడల ప్రభుత్వ భూములు ఒక సెంటు కూడా మిగిలే పనిలేదని వారు తెలిపారు. కావున ఇప్పటికైనాను రెవెన్యూ అధికారులు స్పందించాలని ప్రభుత్వ భూములను కాపాడి మా మూగజీవాలను రక్షించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారు.

## మంత్రి దుర్గేష్‌ను కలిసిన జనసేననేత నలిశెట్టి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ను మంగళవారం అమరావతిలో ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీధర్ ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని పలుమండలాల నాయకులు, పట్టణ నాయకులు కూడా కలిశారు. ఈ సందర్భంగా నలిశెట్టి శ్రీధర్ మంత్రి దుర్గేష్‌తో ఆత్మకూరు నియోజకవర్గ రాజకీయాలు, జనసేన పార్టీ పరిస్థితి, కమిటీలు తదితర అంశాలగురించి చర్చించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చుక్కల భూములు సమస్యల, సోమశిల హైలెవల్‌కెనాల్‌పనులు, సోమశిల ప్రాజెక్టు ఆప్రాన్ పనులు, నడికుడి-శ్రీకాళహస్తి రైలుమార్గం తదితర అంశాలపై నిర్వహించిన ఆందోళనలు, ధర్నాలు, రిలే, ఆమరణ నిరాహారదీక్షలు, పాదయాత్రలు తదితరాలను వివరించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సాధిస్తున్న అభివృద్ధి గురించి కూడా శ్రీధర్ మంత్రి దుర్గేష్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల, పట్టణ జనసేన నాయకులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూ వీసీని సన్మానించిన కాట్వానేతలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఆత్మకూరుకు చెందిన పార్లపల్లి నాగేశ్వరమ్మ, ఇతర నాయకులు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయనను నాగేశ్వరమ్మ శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి విక్రమసింహపురి యూనివర్శిటి వైస్‌ఛాన్సిరల్‌గా నియమితులనందుకు అభినందనలు తెలిపారు. ఏపి కాట్వా రాష్ట్ర అధ్యక్షుడు హరిదాసుల మాధవరావు, రాష్ట్ర కార్యదర్శి బంగారురాజు, రాష్ట్ర ఆర్థికకార్యదర్శి పోతంశెట్టి రమేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు గునుకుల శివయ్య అనుమతులమేరకు నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గాల కమిటీల నాయకులు తదితరులు అల్లం శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాట్వా జిల్లా, నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

## చక్రపాణిని అభినందించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి అసోసియేషన్ ప్రెసిడెంట్గా ఉన్న తనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.చక్రపాణి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే నూతనంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన చక్రపాణిని సెలవుతో సత్కరించి అభినందనలు తెలిపారు. వీరితో పాటు సీనియర్ అడ్వకేట్ శివప్రసాద్ రెడ్డి, గౌతమ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సబ్సిడీపై లోన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోండి : ఎంపీడీఓ శ్రీహరి

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** 2025-26వ ఆర్థిక సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకం అమలు ద్వారా జీవనోపాధి కల్పించుటకు ప్రభుత్వం ఎస్సీ యాక్షన్ ప్లాన్ ప్రకటించిందని బుచ్చిరెడ్డిపాలెం ఎంపీడీవో శ్రీహరి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యాచరణ ప్రణాళికలో 25మంది ఎస్సీ లబ్ధిదారులకు 25 యూనిట్లు 97లక్షలు వ్యయంతో మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో బ్యాంక్ లోను 55లక్షలు సబ్సిడీ 37లక్షలు, లబ్ధిదారులు వాటా 5లక్షలతో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులు online apobmms.apcfss.in నందు ఏప్రిల్ 12 నుండి మే 10లోగా రిజిస్టర్ చేసుకోవాలని ఎంపీడీఓ ప్రకటనలో తెలియజేశారు.

## మా రాముడు అందరివాడు సినిమా ఆడిషన్స్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాకు చెందిన యువ నటుడు శ్రీరామ్ తన తొమ్మిదవ చిత్రంగా నటిస్తున్న మా రాముడు అందరివాడు సినిమా ఆడిషన్స్ నెల్లూరు నగరంలోని హోటల్ అభిరామ్ హోటల్‌లో ఈనెల 19, 20, 21, తేదీలలో సినిమా ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు హీరో శ్రీరామ్ తెలిపారు. నెల్లూరు నగరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన నూతన నటి నటులకు అవకాశం ఇవ్వాలన్న లక్ష్యంతో ఆడిషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు 9347209006 సంప్రదించవలసిందిగా కోరారు.

## ఈదురు గాలుల బీభత్సం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. వర్షానికి ముందు ఈదురుగాలులు బలంగా వీయడంతో దువ్వ ధూళితో చెలరేగడంతోపాటు పైక్సీలు, హోర్డింగ్లు నేలకొరిగాయి. అలాగే మామిడి కాయలు, కొమ్మలు నెలరావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అతి తక్కువ ఖర్చుతోనే అపోలో హాస్పిటల్‌లో

# మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు

- మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సల్లో అపోలో హాస్పిటల్ నెంబర్ వన్
- కేవలం 2.5లక్షల ఫీజుతోనే పూర్తి స్థాయిలో ఆపరేషన్
- రోబోటిక్ సహాయంతో చేసే శస్త్ర చికిత్సలు 100 శాతం సురక్షితం
- సద్వినియోగం చేసుకోవాలన్న నెల్లూరు అపోలో హాస్పిటల్ వైద్యులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** అతి తక్కువ ఖర్చుతోనే రోబోటిక్ సహాయంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు. రోబోటిక్ మోకాలి మార్పిడి ఆపరేషన్లు చేయించుకునే వారికి దానికి అవసరమైన పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్లు డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయడంలో నెల్లూరు అపోలో హాస్పిటల్ అగ్రగామిగా ముందుకు వెళుతుందని చెప్పారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో అధునాతన విధానంలో రోబోటిక్ సాయంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రోబోటిక్ సాయంతో చేసే శస్త్ర చికిత్సలు 100శాతం ఖచ్చితత్వంగా ఉంటాయని పేర్కొన్నారు. అంతే కాకుండా అతి తక్కువ రక్త స్రావంతో పాటూ శస్త్ర చికిత్సకు సంభందించిన మచ్చలు కూడా ఉండవన్నారు. శస్త్ర చికిత్స తర్వాత నొప్పి కూడా చాలా తక్కువగా ఉంటుందని, వేగంగా కోలుకోవచ్చునని చెప్పారు. శస్త్ర చికిత్స తర్వాత హాస్పిటల్‌లో ఎక్కువ రోజులు కూడా ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు వెల్లడించారు. నెల్లూరులో అపోలో హాస్పిటల్‌ను ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేవలం 2లక్షల 50వేల ఫీజుతోనే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. ఉన్న రోగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీరాం సతీష్, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ శశిధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో వారితోపాటు ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైను కనెక్షన్లను వేగవంతం చేయండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరవ్యాప్తంగా జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్ల, వాటర్ సప్లయ్ పనులను వేగవంతం చేసి, కాలుష్యరహిత నెల్లూరు నగరానికై తోడ్పడాలని కమిషనర్ సూర్యతేజ అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక తొమ్మిదవ డివిజన్ నవాబుపేట, కుసుమ హరిజనవాడ, యనమలపాలెం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ, వాటర్ సప్లయ్ 49 జోన్లు నందు ఇంటింటి కనెక్షన్ల పనులను కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి.నారాయణ ఆలోచనల మేరకు ప్రజలపై భారం పడకుండా భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లను కేవలం ఒక్క రూపాయికే అందిస్తున్నామని తెలిపారు. భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్లను నిర్దేశించిన ప్రతిరోజూ లక్ష్యాలను ఎల్ అండ్ టి,మెగా సంస్థ ప్రతినిధులు త్వరితగతమున పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా నగరవ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణ పనులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించగలమని కమిషనర్ తెలియజేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానంతో దోమలు లేని పర్యావరణహితమైన సుందర నగరాన్ని నిర్మించుకోగలమని కమిషనర్ తెలిపారు. అనంతరం స్థానిక డ్రైవర్స్ కాలనీ, పొట్టే పాలెం మురుగునీటి శుద్ధి కేంద్రాలను కమిషనర్ పర్యటించి, కేంద్రాలలో జరుగుతున్న మురుగు నీటి శుద్ధి పనులను, వివిధ విభాగాల్లో పనితీరును పర్యవేక్షించారు.

## ఫిష్ పాండ్ పనులను పరిశీలించిన పీడీ గంగాభవాని

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధి హామీ పథకం ద్వారా వింజమూరు పాతూరు జరుగుతున్న ఫిష్ పాండ్ పనులను మంగళవారం ద్వామా పీడీ గంగాభవాని పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. రోజుకు సుమారు నాలుగు గంటలు పనిచేయాల్సి ఉంటుందని అప్పుడే 300 రూపాయల కూలీ వస్తుందన్నారు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసి తమ యొక్క వేతనాన్ని పొందాలన్నారు. అలాగే కూలీలకు వేసవి తాపం నుండి తప్పించేందుకు నీడ నీరు లాంటి ఏర్పాటు చేయాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఏ విధంగానైనా కూలీలకు గిట్టుబాటు కూలి వచ్చే విధంగా పనులు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సుభాషిని ఈసీ




కృష్ణారావు టి.ఏమురళి ఎఫ్ఎ.శ్రీనివాసులు కూలీలు తదితరులు ఉన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి కావలి కీర్తి ప్రతిష్టలను పెంచిన శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ విద్యార్థులను కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అభినందించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు మంగళవారం ఎమ్మెల్యేను కార్యాలయంలో కలిశారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఇష్టమైన కోర్సు తీసుకొని నచ్చిన వృత్తి ఉద్యోగాలలో రాణించాలని వారిని అశీర్వదించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన కాలేజీ అధ్యాపకులను, యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

## రికార్డు ఆధారంగానే.. ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం : మండల తహసిల్దార్ స్వప్న



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రికార్డు ఆధారంగానే ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని మండల తహసిల్దార్ స్వప్న అన్నారు. తహసిల్దార్‌ను కలిసిన విలేకరులతో మంగళవారం ఆమె మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి తగిన నివేదిక తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రధానంగా రైతులు సహకారం ఉంటేనే రైతులకు న్యాయం చేయగలుగుతామని తహసిల్దార్ పేర్కొన్నారు. గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు ఇచ్చే విషయంలో రెవెన్యూ శాఖ చక్కగా పనిచేస్తుందని తాసిల్దార్ తెలిపారు. కృష్ణపట్నంలో జరగనున్న రీసర్వే ప్రాజెక్టు విషయంలో రైతులు సహకారం అందించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వే జరిగే విధంగా చూడాలని తహసిల్దారు కోరారు.

## కృష్ణపట్నంలో రీ సర్వేపై రైతులకు అవగాహన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలో రెవిన్యూ శాఖ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీ సర్వే ప్రాజెక్టుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. అధికార పార్టీ నాయకులు రాగాల శివకృష్ణ, వై.కోదండ రామయ్య సమక్షంలో ఈ కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ చేపట్టింది. తహసిల్దార్ స్వప్నతోపాటు మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియపై రైతులకు తాసిల్దారు సమగ్రమైన అంశాలను తెలియపరిచారు. రైతులు సహకారం అందించాలని తాసిల్దారు విజ్ఞప్తి చేశారు. రైతులకు నోటీసులు ఇచ్చిన తర్వాతే సర్వే చేస్తామని ఎలాంటి భయం అక్కర్లేదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు అగ్నిమాపక శాఖ ఆదేశాల మేరకు స్థానిక అగ్నిమాపక కేంద్ర ఆధ్వర్యంలో వింజమూరులోని బస్టాండ్ సెంటర్ నందు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక అధికారి ఎం.చంద్రమౌళి ప్రమాదాలకు గురైనప్పుడు ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా నివారించుకోవాలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. అదేవిధంగా ప్రధాన రహదారి వెంబడి దుకాణాల వారికి ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు ప్రమాదాల నివారణ జాగ్రత్తలు గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మహేంద్ర, ప్రభాకర్, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మూలాపేటలో పోలీస్ క్వార్టర్స్‌లో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజు తన భార్య పూర్ణిమ తో కలిసి మూలాపేట పోలీస్ క్వార్టర్స్ లో ఉంటున్నారు. వీరికి తొమ్మిది నెలల క్రితం వివాహం అయింది. వివాహం అయినప్పటి నుంచి భర్త వేధింపులు కారణంగా ఇంట్లోనే పూర్ణిమ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది బంధువులు ఆరోపించారు. ఆయనకు గతంలో ఒక వివాహం అయిందని ఆమె కూడా ఆత్మహత్యకు పాల్పడి చనిపోయిందని బంధువుల ఆరోపణ. సీఐ కోటేశ్వరరావు సంఘటన స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు.

# ముస్లింలకు విరోధి సీఎం చంద్రబాబు

### ఇంటెలెక్చువల్ వింగ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్ ఖాన్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోడీ తొత్తుగా మారి ముస్లింలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్రోహం చేశారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ వింగ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌కె సమీర్ ఖాన్ తెలిపారు. మంగళవారం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముస్లింల పక్షపాతిగా జగన్మోహన్ రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు చంద్రబాబు మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతూ మద్దతు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీనికి వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి పోరాటం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న కుట్రలను ముస్లిం మైనార్టీలందరూ గమనించాలని కోరారు. తెలుగుదేశం పార్టీకి గుణపాఠం నేర్పేందుకు ముస్లింలందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నెల్లూరు తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు మైనారిటీలకు అన్యాయం జరుగుతుంటే మౌనం వహించి ఎందుకు దాకున్నారని పేర్కొన్నారు. మైనార్టీ ఓట్లు కోసం వచ్చి ఇంటింటికి తిరుగుతారు కానీ మైనార్టీలకు అన్యాయం జరిగితే మొహం చాటేస్తే తెలుగుదేశం పార్టీ నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు.

# ముస్లింల హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** వక్ఫ్ చట్టాన్ని అమలు చేయడం ద్వారా ముస్లింలకు ఉన్న హక్కులని పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం హరిస్తుందని మండలంలోని ముస్లిం సోదరులు మండల కేంద్రమైన మర్రిపాడు సెంటర్లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలు అయితే ముస్లింలకు కబరస్థాన్లు కూడా ఉండమన్నారు. ముస్లిం ఇతరులని ఈ కమిటీలలో పెట్టడం ద్వారా రాజ్యాంగంలోని హక్కులను హరిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశానికి మంచి చేయడం మర్చిపోయి ముస్లింలను టార్గెట్ చేయడం ద్వారా కొత్త కొత్త చట్టాలను, చట్ట సవరణలు చేసి ముస్లింలను మరింత అణిచివేతకు గురి చేస్తుందన్నారు. గత 11 నెలలో బిజెపి ముస్లింలకు చేసిన మంచి ఏమీ లేదని ఈ వక్ఫ్ చట్టం అమలైతే ముస్లింలకు చెప్పుకునే దానికి ఇంకేమీ మిగలదన్నారు. ప్రజలందరూ కూడా సంఘటితమై కేంద్రం చేస్తున్న చట్టాలను చట్ట సవరణలు వ్యతిరేకించాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. అనంతరం మర్రిపాడు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లి తాసిల్దార్ కార్యాలయం వరకు తగు నినాదాలు చేశారు. తమ హక్కులను హరించకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఉందని డిమాండ్ చేశారు.

# దొడ్ల వారి కుటుంబం దాతృత్వం

- సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎంతో సేవ చేసిన దొడ్లవారు
- ఇన్వెక్టర్ సదుపాయానికి రూ.1లక్ష విరాళం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన దొడ్లవారి కుటుంబం దాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెన్నైకి చెందిన దొడ్ల వరదారెడ్డి రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించారు. ఆరోగ్య కేంద్రంలో ఇన్వెర్టర్ కొరకు దొడ్ల కోదండరామిరెడ్డి ద్వారా లక్ష రూపాయల చెక్కును వైద్య అధికారి పద్మజాకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పద్మజ మాట్లాడుతూ.. దొడ్ల కుటుంబం సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. నూతనంగా నిర్మించినభవనానికి ఇన్వెర్టర్ లేదని కమిటీ నెంబర్ అయిన టిడిపి నేత దొడ్ల కోదండరామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై ఆయన స్పందించి దాతల సహకారంతో ఇన్వెర్టర్ కొరకు లక్ష రూపాయలు చెక్కును అందజేశారన్నారు. మొదటి నుండి దొడ్ల కోదండరామిరెడ్డి ఆయన సొంత నిధులతోపాటు దాతల సహకారంతో ఆసుపత్రికి పలు వైద్య పరికరాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు శేషయ్య తుమ్మల ప్రసాద్, కౌన్సిలర్ రాచూరి సత్యం, దుగ్గిశెట్టి హరినాథ్ సొల్లేటి ప్రభాకర్, పొన్నపోలు సుమన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ కార్మికులను పరామర్శించిన కౌన్సిలర్ ప్రత్యూష



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చి టౌన్ తెల్లవారుజామున విధుల్లో ఉన్న మున్సిపల్ కార్మికుల పైకి దూసుకెళ్లిన లారీ దీంతో గాయాలు పాలైన క్షతగాత్రులను నారాయణ ఆసుపత్రిలో చేరగా ఇట్టి విషయం తెలుసుకున్న కౌన్సిలర్ డాక్టర్. అందే ప్రత్యూష హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. దీంతో ప్రమాదానికి గురైన వారి దగ్గరకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# పారిశుద్ధ్య కార్మికులను పరామర్శించిన చైర్ పర్సన్ దంపతులు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** లారీ యాక్సిడెంట్‌లో గాయపడి నారాయణ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బుచ్చినగర పంచాయతీ పారిశుధ్య కార్మికులను బుచ్చి నగర పంచాయతీ చైర్ పర్సన్ మోరల సుప్రజా మురళి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, పరామర్శించారు. పరామర్శించిన వారిలో 6వవార్డు కౌన్సిలర్ షేక్ రహమత్ బాషా, 10వ వార్డు కౌన్సిలర్ బెలుం మల్లారెడ్డి, 17వ వార్డు కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి, 13వ వార్డు కౌన్సిలర్ పుట్టా. లక్ష్మీకాంతమ్మ, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహస్వామి, పెద్దూరు తెలుగుదేశం నాయకులు ఇప్పగుంట సుధాకర్ రెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు వున్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన అవార్డు గ్రహీత అంకయ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి చెందిన దానం అంకయ్యకు ఇటీవల జరిగిన ఉగాది పురస్కారాల్లో జానపద రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు అంకయ్యకు కళా రత్న (హంస) అవార్డును మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందుకున్నారు. కళా రత్న(హంస) అవార్డును అందుకొని కావలికి కీర్తి ప్రతిష్టలు పెంచిన అంకయ్య మంగళవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అవార్డు గ్రహీత అంకయ్యను ఎమ్మెల్యే కావ్య శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కావలికి ఇటువంటి కీర్తి ప్రతిష్ట అందించిన వెంకయ్యను ఘనంగా అభినందించి రానున్న రోజుల్లో ఇంకా ఎన్నో అవార్డులు తీసుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుర్రం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# షటిల్ టోర్నమెంట్ గోడపత్రికను ఆవిష్కరణ



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 18 తేదీన జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే సూచనలు మేరకు దేవరకొండ శ్రీనివాస్, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గం పరిధిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ గోడపత్రికను ఎమ్మెల్యే కావ్య ఆవిష్కరించారు. టోర్నమెంటులకు కావలి విద్యా నిలయం ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానంలో ఉంచిన విద్యా సంస్థ జవహర్ భారతి కళాశాల ప్రాంగణంలో ఉన్న షటిల్ కోర్టులో ఈ క్రీడలు నిర్వహించడం నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా తమ ప్రతిభను నిరూపించుకోవాలని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

# అగ్ని ప్రమాదాలపై కరపత్రాలు పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు బస్టాండ్ సెంటర్ నందు రెండోరోజు మంగళవారం అగ్నిమాపక సిబ్బంది వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమపాక శాఖ అధికారి వి.పెంచలయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ సముదాయంలో ఉన్న దుకాణాదారులకు ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ.. వారం రోజులు జరిగే అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదాలు జరిగి ప్రదేశాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఒక్కరోజు ఒక్కో ప్రదేశంలో అంటే పెట్రోల్ బంకు, హోటల్స్ సమీపంలో, స్కూల్స్‌లో, ఇండస్ట్రీయల్ ప్రదేశాలలో అగ్నిమపాక వారోత్సవాల అవేరేన్స్ కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు.

# తప్పుడు రాజకీయాలను ప్రోత్సహిస్తున్న టీడీపీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, బోగోలు మండల వైసీపీ నాయకులు మద్దిబోయిన రఘు, గంధం ప్రసన్నాంజనేయులు, సీనియర్ మాజీ కౌన్సిలర్ కనుమర్ల పూడి నారాయణ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ నాయకులు ఒక మీడియా మధ్యవర్తిని అడ్డం పెట్టుకొని మాజీ శాసనసభ్యులపై సోషల్ మీడియాలో తప్పుడు రాతలు రాయించడం ఎంతవరకు సమంజసం.. అలాగే మాజీ ఎమ్మెల్యేపై రాసిన వారు రేపు మీ ఎమ్మెల్యేపై రాయరని గ్యారెంటీ ఉందా.. ఇది మీకు సాంప్రదాయమైన అని ప్రశ్నించారు. ఇదే మీడియాలో పనిచేయుచున్న వ్యక్తి గతంలో బీద మస్తాన్ రావు దగ్గర ఉన్న మాట వాస్తవం కాదా.. వారి దగ్గర ఇతను చేసిన కార్యాలు తెలియవా.. అలాగే విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, దగ్గర ఈరోజు ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దగ్గర భజన చేయడం.. రేపు ఇంకొక నాయకుడు వస్తే ఆయన దగ్గర కూడా ఇదే భజన కార్యక్రమం చేస్తారు. కదా ఇలాంటి వాళ్లను ప్రోత్సహిస్తే మనుగడకే ప్రమాదం అని వారు తెలిపారు. కొందరు పగటివేషగాళ్లు ఎక్కువ అయ్యారని సంవత్సరంలో ప్రతి పండగ వస్తే పండక్కి పార్టీ మారే వేషగాళ్ళు ఈరోజు మా మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తుందని, గతంలో తను చరిత్ర ఏందో ఒకసారి ఆలోచించుకొని మాట్లాడితే బాగుంటుందని, ప్రజలు ఆ మాటలను చూసి నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. మీడియా ముందుకు వచ్చి మాజీ ఎమ్మెల్యేపై ఎలా పడితే అలా మాట్లాడడం బాగుండదు చోటా నాయకా గుర్తుపెట్టుకో.. దమ్ముంటే అభివృద్ధి చేసి చూపండి అంతేకానీ చౌక భాగం మాటలు మాట్లాడడం సరైన పద్ధతి కాదని తెలిపారు. కావలి నియోజకవర్గంలో ప్రతిరోజు మనం చూస్తున్నాం గ్రావెల్ మాఫియా, రేషన్ మాఫియా, మద్యం మాఫియా, పత్రికల్లో ఎలక్ట్రానిక్ మీడియాలో రావడం చూస్తున్నారు ఇది నిజం కాదా.. కావలి నియోజకవర్గంలో నలుగు దిక్కుల అక్రమ అక్రమ ఇసుక రవాణా జరుగుతుంది వాస్తవం. గతంలో వైసీపీ నాయకులపై ఆరోపణ చేసిన మీరు ఈరోజు మీరు చేస్తున్నది ఏమిటి.? ఇది మాఫియా కాదా.. మీరే చెప్పండి అంటూ వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో కొందరు చేస్తున్న అభియోగాలను మాట్లాడుతున్న మాటలపై ఘాటుగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మాజీ కౌన్సిలర్స్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దర్గా, శ్మశానవాటికలో మౌళికవసతులు కల్పించాలి : ఆవాజ్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని శ్రీ సుల్తాన్‌షాహిద్ దర్గా, శ్మశానవాటికలో కనీస మౌళికవసతులు కల్పించాలని ఆవాజ్‌కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మౌళికవసతులు, ఇతరత్రా సమస్యల పరిష్కరించాలంటూ ఇటీవల ధర్నా నిర్వహించగా ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నినాదాలుచేస్తూ సంతకాలసేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత సంవత్సరం జూలైలో మూడురోజుల పాటు జెసిబితో పెకలించిన కంపచెట్లను ఇప్పటికీ తొలగించలేదన్నారు. వెంటనే ఆ చెట్లను తొలగించాలని, శ్మశానవాటికలో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌సౌకర్యం కల్పించాలని, అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను తొలగించి నూతనంగా నిర్మించాలని, దర్గాపరిసరాలను శుభ్రపరచాలని, గత 12సంవత్సరాలుగా వక్ఫ్‌బోర్డు రూములుద్వారా వస్తున్న ఆదాయ వివరాలు తెలపాలని, దర్గాలో ముజావర్, స్వీపర్ల జీతాలు పెంచాలని, స్వీపర్లకు 8గంటల పని విధానం అమలు చేయాలని ఆవాజ్‌కమిటీ మండల కార్యదర్శి పి.యస్దాని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని యస్దాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్‌కమిటీ సభ్యులు దర్గా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం మాతా, శిశుసంరక్షణకు అత్యంత ప్రయోజనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పౌష్టికాహారం మాతీ, శిశువులకు అత్యంత ప్రయోజనకరమని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ పేర్కొన్నారు. పోషణ్‌పక్వాడ్‌లో భాగంగా మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఈస్ట్‌ముస్లిం ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సదస్సులో సూపర్‌వైజర్ రత్నమ్మ ప్రసంగించారు. ప్రతి గర్భిణీ, ప్రతి బాలింత, పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలంటే తప్పకుండా పోషకవిలువల ఆహారం తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు పాలు, కోడిగ్రుడ్లు, బాలామృతం తదితరాలను అందిస్తుండడంతోపాటు పోషకవిలువల ఆహార పదార్ధాలను టేక్‌హోమ్‌రేషన్‌గా ఇస్తున్నామని, వాటితోపాటు తమకు అందుబాటులో లభించే పోషకవిలువల ఆహారాన్ని కూడా తీసుకోవాలన్నారు. తద్వారా అందరూ ఆరోగ్యవతంగా ఉంటారని, రక్తహీనత సమస్య తలెత్తబోదని పేర్కొన్నారు. అందుబాటులో లభించే వాటితో తయారు చేసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని గురించి ఆమె వివరించారు. అందరికీ పౌష్టికాహారం వలన కలిగెడి ప్రయోజనాలపట్ల మహిళలందరికీ అవగాహన కల్పించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు పోష్టికాహార ప్రదర్శనలు, గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం, ర్యాలీలు, సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ సదస్సుల లక్ష్యం మేరకు అందరూ పౌష్టికాహారం తీసుకోవాలని, తాము నిర్వహించిన సదస్సుల ద్వారా తగిన చైతన్యం పొంది తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యవంతంగా ఉండాలని రత్నమ్మ కోరారు. గర్భిణీలు, బాలింతలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. ఈమేరకు ప్రతి గర్భిణీ, ప్రతి బాలింత అంగన్‌వాడీ కేంద్రాలద్వారా లభించే పౌష్టికాహారంతోపాటు తమకు అందుబాటులో లబించే పౌష్టికాహారం కూడా తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సాహేరా, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్యాలయం ఎదుట చలువపందిరి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట చలువపందిరిని ప్రారంభించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కార్యాలయానికి వచ్చే వినియోగదారులు విశ్రమించేందుకు ఈ చలువపందిళ్ళను ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. కార్యాలయం ఎదుట కనీస నీడనిచ్చే చెట్టుకూడా లేనందున ఏర్పాటు చేశామన్నారు. ఏర్పాటు పట్ల పలువురు వినియోగదారులు హర్షం వ్యక్తచేసి యూనియన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యమ్రంలో యుఈఈయు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగ్గా ఉంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీపీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పల్లెసీమల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉంచాలని, అందరూ ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు చెత్తనుండి సంపద తయారుచేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్న లక్ష్యంగా మండలంలోని 7 పంచాయతీల నిధుల నుండి కొనుగోలు చేసిన ట్రైసైకిళ్ళను ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపిపి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీల్లో అందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తను వృధా చేయకుండా తడి,పొడిగా వేరుచేసి డంపింగ్ యార్డులకు ఈ ట్రైసైకిళ్ళద్వారా తరలించాలని, అక్కడ వర్మికంపోస్టు తయారు చేస్తే గ్రామంలో పరిశుభ్రతతో పాటు పంచాయతీకి రాబడి కూడా లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుధ్య మెరుకుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గ్రీన్ అంబాజిదర్ల ద్వారా చెత్తను ట్రైసైకిళ్ళ ద్వారా చెత్తసంపద కేంద్రాలకు తరలించాలని ఆయన కోరారు.

## అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అగ్ని ప్రమాదాలు జరక్కుండా ప్రతి ఒక్కరు ముందస్తుగా అప్రమత్తంగా వుండాలని ఇన్‌ఛార్జ్ ఫైర్ అధికారి అశోకకుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం అగ్నిమాపక మారోత్సవాలసందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సిబ్బంది, కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. ప్రమాదాలను అప్రమత్తంగా వ్యవహరించి నివారించుకోవచ్చన్నారు. వంట చేసే సమయంలో గృహిణీలు అప్రమత్తంగా వుండాలన్నారు. అనంతరం ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## వధువు వేధింపు.. నలుగురిపై కేసు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలానికి చెందిన అనూష అనే యువతి, భర్త తురక లోకేశ్‌తో పాటు అతని తండ్రి, తల్లి, మరిది అదనపు పైబడి కోసం వేధించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత ఏప్రిల్‌లో వీరి వివాహం జరిగిందని, భర్త మద్యం అలవాటుతో దౌర్జన్యం చేస్తుండగా, మిగతా కుటుంబసభ్యులు మానసిక, శారీరక వేధింపులకు గురి చేశారని పేర్కొంది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలకు ఏప్రిల్ 14 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు మే 10లోపు https://apobmms.apcfss.in వెబ్‌సైట్ లేదా గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యవసాయం, రవాణా, పరిశ్రమలు తదితర రంగాల్లో ఆర్థిక సహాయం అందించనున్నారు. 21-50ఏళ్ల మధ్య ఉండాలి. బీపీఎల్ కార్డు, కుల ధృవీకరణ పత్రం తప్పనిసరి.

## మర్రిపాడులో వడగండ్ల వాన



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో మంగళవారం వడగండ్ల వాన కురిసింది. ముందుగా విపరీతమైన గాలులతో ప్రారంభమై అకాల వర్షం కురిసింది. గాలులతో కూడిన వర్షపాతం నమోదవడంతో మండల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉన్నట్లుండి గాలులతో కూడిన వడగండ్ల వాన కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ గాలుల బీభత్సం వలన మండలంలోని మామిడి రైతులు నష్టపోక తప్పలేదు. దాదాపు అరగంటసేపు వర్షపాతం నమోదవడంతో వాతావరణం కొంతమేర చల్లబడినట్లు అయింది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఉపశమనం పొందారు. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్న తరుణంలో ఈ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ప్రతిభా విద్యార్థికి అభినందనలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని బీసీ బాలుర వసతి గృహంలో ఇంటర్మీడియట్ చదువుతున్న బి.వెంకట సుశాంత్ 1000 మార్కులకు గాను 962 మార్పులు సాధించి తమ ప్రతిభను చాటారు మంగళవారం కావలి ఏబిసిడబ్ల్యూ అధికారి వెంకటేష్ వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వెంకట సుశాంత్, వారి తండ్రిని అభినందిస్తూ చిరు సన్మానం చేయించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. వసతి గృహంలోని విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని పౌష్టికాహారంతోపాటు అల్పాహారం కూడా పరిశుభ్రంగా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని చక్కగా చదివి ఉత్తమ మార్కులు పొందేందుకు ఉపయోగించుకోవాలన్నారు అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి పి.వెంగళరావు బిసి వసతి గృహ సంక్షేమాధికారి షేక్ రియాజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర బ్రాహ్మణసమాఖ్య ఉపాధ్యక్షుడుగా శివయ్యస్వామి ప్రమాణస్వీకారం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని శ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరాలయం (శివాలయం) ప్రధాన అర్చకులు, ఆత్మకూరు సీమ బ్రాహ్మణసేవాసమితి అధ్యక్షులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ (శివయ్యస్వామి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఇటీవల ఎన్నికకాగా ఏలూరులో మంగళవారం జరిగిన రాష్ట్ర బ్రాహ్మణసమాఖ్య మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేశారు. అక్కడి ఎమ్మెల్యే వెంకట్రామయ్య అతిదిగా హాజరుకాగా రాష్ట్రకమిటీ ప్రతినిధులు, పలుజిల్లాల ప్రతినిధులు, పార్టీకతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది బ్రాహ్మణులు హాజరుకాగా అందరి సమక్షంలో శివయ్యస్వామి ప్రమాణ స్వీకారం చేయగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆయనను అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఆయన నాలుగుదశాబ్దాలుగా ఆత్మకూరు శివాలయం ప్రధానఅర్చకులుగా కొన సాగుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో శివాలయం దినదిన ప్రవర్ధమానమై వెలుగొందుతోంది. ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షులుగా ప్రతిఏటా పేద బ్రాహ్మణవటువులకు ఉచితంగా ఉపనయనాల కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహిస్తుంటారు. బ్రాహ్మణసామాజికవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి, ప్రోత్సాహానికి ఆయన విశేషంగా కృషి చేస్తుంటారు. కరోనా కష్టకాలంలో ఆయన తమ సామాజికవర్గీయులకు అందించిన సేవలు అమోఘం. ఆత్మకూరులోనే కాకుండా నెల్లూరు జిల్లాలోనే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఆయన పౌరోహిత్యం నిర్వహిస్తుంటారు. ఆయన ఆధ్యాత్మికత, పౌరోహిత్యపటిమ, వాస్తు సేవలను గుర్తించి నాలుగేళ్ళక్రితం రాష్ట్ర అర్చక పురోహితసంఘ ప్రధానకార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆయన పౌరోహిత్యాం, సామాజిక సేవలను గుర్తించిన మనం ఫౌండేషన్ వారు మానవీయతా ప్రతిభాపురస్కార్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఆత్మకూరు శివాలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రతిశివరాత్రినాడు రంగరంగవైభవంగా శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి–అన్నపూర్ణాదేవిల కళ్యాణోత్సవం వీనులవిందుగా జరుగుతుంది. కార్తీకమాసంలో శివాలయం శివనామస్మరణతో మార్మోగుతుంటుంది. అన్ని ప్రధాన పండుగలు, పూజలు, హోమాలు, అర్చనలు తదితరాలు అత్యంత వైభవంగా జరుగుతుంటాయి. శివయ్యస్వామిని ఆత్మకూరు ఆధ్యాత్మిక ఆస్థిగా, ఆయన మంత్రోచ్చారణ అత్యంత పవిత్రంగా, ఆయన హస్తవాసి అదృష్టంగా అందరూ భావిస్తుంటారు. శివయ్యస్వామిని రాష్ట్ర బ్రాహ్మణసమాఖ్య ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవడంతో శివాలయం భక్తమండలి, ఆత్మకూరు సీమ




బ్రాహ్మణసేవాసమితి కార్యవర్గప్రతినిధులు, ఈ ప్రాంతంలోని అర్చకులు, వివిద పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, భక్తులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అభినందనపరంపర కొనసాగించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తనపై విశ్వాసంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన తమ బ్రాహ్మణసమాఖ్య ప్రతినిధులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోవడం సంతోషదాయకమని, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ ప్రతినిధులకు ధన్యవాదాలని, తనను అభినందించినవారందరికీ ధన్యవాదాలని, తనవంతుగా యధావిధిగా సేవలందించడంతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా తనవంతు బాధ్యతలను కర్తవ్యదీక్షతో నిర్వహిస్తానని శివయ్యస్వామి పేర్కొన్నారు.

# శంఖవరం గ్రామంలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం శంఖవరంలోని అంగన్వాడీ కేంద్ర పరిధిలో పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ సూపర్వైజర్ ఎస్కే షకీలా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల మాద్యూల్లో కుటుంబాల నమోదు చేసుకోవడానికి మార్గ నిర్దేశం చేయడానికి ప్రత్యేక గృహ సందర్శనాలు విహెచ్ఎస్ఎన్‌డి సమయంలో లబ్ధిదారులనమోదు కార్యక్రమాలు ఏడబ్ల్యుడబ్ల్యు అండ్ ఏఎస్‌హెచ్ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు సహాయం చేయుట వంటి కార్యక్రమాలను అంగన్వాడీ కేంద్రం నందు స్థానిక లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఏడవ పోషకాహార వక్షోత్సవంలో నిర్దేశించిన నాలుగు అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. వెయ్యి రోజుల సంరక్షణ పోషణ ట్రాకర్‌లో స్వయంగా లబ్ధిదారులు నమోదు చేసుకోవడం. పోషక పోషకాహార లోపాలకు గురైన పిల్లల ప్రత్యేక సంరక్షణ ఆరోగ్యవంతమైన జీవనశైలి కల్పించేందుకు కార్యకర్తలు కృషి చేయాలి అన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎల్ శైలజ ఆశా వర్కర్ ఎంఎస్కే స్రవంతి తల్లులు గర్భవతులు బాలింతలు ఉన్నారు.

# కౌన్సిలర్ ప్రత్యూష జన్మదిన వేడుకలు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చి టౌన్ టీడీపీ నాయకురాలు మూడో వార్డు కౌన్సిలర్ డాక్టర్ అందే ప్రత్యూష పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ బదిర పాఠశాలలో జరుపుకున్నారు. ముందుగా పిల్లల మధ్య కేక్‌ను కట్ చేసి వేడుకలను ప్రారంభించి, విద్యార్థులకు ఎనర్జీ డ్రింక్, కేక్స్ ప్యాకెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాపుట్టినరోజును అనాధ పిల్లల మధ్య జరుపుకోవడం కొత్త ఆనందాన్ని, సంతృప్తిని ఇచ్చిందని, పుట్టినరోజును పురస్కరించుకొని నా ఫాలోవర్స్ వివిధ సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభిందనీయమని అన్నారు. ఈ సందర్భముగా ఆమేకు నగరంలో పలువురునాయకులు కార్యకర్తలు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షులు తుమ్మల ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి నాయకులు కోవూరు మహేష్, కౌన్సిలర్ వైష్ణవి, రంజిత్, కళ్యాణ్, బాలు, కృష్ణా, పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు యాజమాన్యం నగెల్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్లలో ప్రమాణాలను పాటించండి




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో సూచించిన ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూర్యతేజ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక వెంగళరావు నగర్ అన్న క్యాంటీన్‌ను కమిషనర్ మంగళవారం సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్లలో చల్లటి, సురక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, టోకెన్ విధానం ద్వారా మాత్రమే ప్రజలకు ఆహారాన్ని అందించాలని క్యాంటీన్ నిర్వహకులకు కమిషనర్ సూచించారు. నిర్దేశించిన మోతాదు నాణ్యమైన ఆహారం అందించాలని, క్యాంటీన్ ప్రాంగణాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆహారం ప్లేట్లు, ఇతర వంట సామాగ్రిని క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకొని, విచ్చేసే ప్రజలతో సాదరంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు క్యాంటీన్‌కు విచ్చేసి ఆహారం స్వీకరిస్తున్న వారి సంఖ్య, సరఫరా చేస్తున్న ఆహారం మోతాదు వివరాలను ఎప్పటికప్పుడు నివేదికగా క్యాంటీన్ల వారీగా అందించాలని కమిషనర్ నిర్వాహకులకు సూచించారు.

# అంబేద్కర్ ఇండియామిషన్ ఆధ్వర్యంలో ర్యాలీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో సోమవారం అంబేద్కర్ ఇండియామిషన్ జిల్లా కన్వీనర్ పట్టెడ మురళీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుండి ఎల్ఆర్‌పల్లి, సోమశిలరోడ్డు సెంటర్, బిఎస్ఆర్‌సెంటర్, జెఆర్‌పేటలమీదుగా మున్సిపల్ బస్టాండువరకు వందలాది మంది ఏఐఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండు వద్ద అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎం జిల్లా నాయకుడు నందా ఓబులేశు, డివిజన్ కన్వీనర్ జూగుంట కొండయ్య, జిల్లా నాయకులు కొప్పోలు వెంకటేశ్వర్లు, ఉదయగిరి సుధాకర్, నిజమాల నరశింహులు, డివిజన్ నాయకులు బొగ్గవరపు బాబు, కిరణ్, కల్లు సురేష్, పండగ నరశింహులు, పెంచలస్వామి, మల్లికార్జున, కొండయ్య, మహేష్, రాంబాబు, బాలఅంకయ్య, ప్రభు, సిద్ధు, కిషోర్, చిన్నూ, ప్రవీణ్, మహేంద్ర, అశోక్, పవన్, అరుణమ్మ, కీర్తి, ప్రవల్లిక, మానస, శ్రావ్య, అలేఖ్య, పావని, మేఘన, హరిణి, హర్షిణి, మౌనిక, శృతి, లహరి, అపూర్వ, లక్కి తదితరులు పాల్గొన్నారు.

# వెంకయ్య ఆశ్రమం ఎదుట చలివేంద్ర ఏర్పాటు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు–సోమశిల మార్గంలోని దేపూరు వద్ద ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం ఎదుట ఒక మజ్జిగ, మంచినీటి చలివేంద్రను ప్రారంభించారు. వెంకయ్యస్వామి ఆశ్రమం ప్రక్కనున్న శ్రీ పెంచలయ్యస్వామి ఆశ్రమ నిర్వాహకులు నాయుడు పెంచలయ్యనాయుడు, నాయుడు భాస్కరనాయుడుల స్వంత నిధులతో ఆశ్రమాలవద్దకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం చలివేంద్రను ఏర్పాటు చేశారు. అటు సోమశిల, ఇటు ఆత్మకూరు, మరోవైపు మహిమలూరు మార్గాల కూడలికావడం, రెండు ఆశ్రమాలుండడంతో నిత్యం జనాలు, భక్తుల రద్దీగా ఉంటోంది. దాంతో అక్కడ చలివేంద్ర అవసరమని గుర్తించిన పెంచలనాయుడు, భాస్కరనాయుడులు మంచినీరు, మజ్జిగ చలివేంద్రను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయుడు పెంచలనాయుడు, సర్పంచ్ రావిళ్ళ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కర్నం వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ సిద్ధవటం ఆదిశేషారెడ్డి, తెలుగుదేశం నాయకులు దొడ్ల సుమన్‌చౌదరి, తూమాటి తిరుపతినాయుడు, కొల్లి తిరుపతినాయుడు, ఆశ్రమ పూజారి నెల్లూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు ఐకెపి కార్యాలయంలో మంగళవారం మాస్టర్ ట్రైనర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ, పకృతి వ్యవసాయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక వ్యవసాయ అధికారి రామ్మోహన్, ఏపిఎం బుజ్జమ్మ హాజరయ్యారు. ఈ వ్యవసాయ సందర్భంగా వ్యవసాయ అధికారి రామ్మోహన్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న సందర్భంగా రైతులు రసాయన ఎరువులకి అలవాటు పడి విపరీతమైన మందులు వాడి ఖర్చు పెరగటంతో ఆత్మహత్యలు ఎక్కువ శాతం జరుగుతున్నాయి. కానీ రూపాయి ఖర్చు లేకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, మన చుట్టుపక్కల ఆకుల తోటి పిచ్చికారి చేసి విషపూరితమైన కీటకాలను చనిపోయే విధంగా తయారు చేసుకోవచ్చని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు అని అన్నారు. అలాగే మన ఆరోగ్యానికి కూడా మంచిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పొదుపు వివిఎలు పకృతి వ్యవసాయం ఐసిఆర్పిలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామ చంద్రబాబు పాలన

- ఆటోనగర్ శంఖుస్థాపనతో బుచ్చి పట్టణ అభివృద్ధికి శ్రీకారం
- స్థానిక యువతకు ఉపాధి దొరుకుతుంది
- సీఎం సహకారంతో షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల సమస్యకు శాశ్వత పరిష్కారం సాధిస్తా.. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఆటో నగర్ శంఖుస్థాపన ద్వారా బుచ్చిరెడ్డి పాళెం ప్రాంత అభివృద్ధికి అంకురార్పణ మొదలైందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చి పట్టణ శివార్లలోని నాగమాంబా పురం వద్ద ఆమె ఆటోనగర్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బుచ్చి మెకానిక్ అసోసియేషన్‌కు చెందిన ఆటో టెక్నీషియన్స్ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి మేళ తాళాల మధ్య పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆమె మాట్లాడుతూ.. బుచ్చిరెడ్డి పాళెం మెకానిక్ సోదరుల చిరకాల స్వప్నమైన ఆటోనగర్ భూమిపూజ కార్యక్రమం ఎమ్మెల్యే హెూదాలో తన చేతుల మీదుగా జరగడంచాలా సంతోషంగా వుందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అభివృద్ధి అనేది మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. కనీస వసతులు లేక రోడ్ల పక్కన మెకానిక్ షెడ్లు నిర్వహించుకుంటున్న దాదాపు 150 మంది మెకానిక్స్, వెల్డర్స్ తదితర టెక్నీషియన్స్‌కు ఈ ఆటోనగర్‌లో శాశ్వత వర్క్ షాపులు రాబోతున్నాయన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ఆటోనగర్ భవిషత్తులో నాగమాంబ పురం స్థానికులకు ఉపాధి కేంద్రంగా మారబోతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించే ట్రాక్టర్లు రిపేర్లు, వ్యవసాయ పనిముట్ల తయారీ లాంటి అవసరాలకు కోసం ఇటు బుచ్చి అటు కొడవలూరు మండల రైతాంగానికి ఈ ఆటోనగర్ చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఆటోనగర్ కోసం కేటాయించిన ఈ భూమిలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ల్యాండ్ లెవెలింగ్ చేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోషించే ట్రాక్టర్లు రిపేర్లు, వ్యవసాయ పనిముట్ల తయారీ లాంటి అవసరాలకు కోసం ఇటు బుచ్చి అటు కొడవలూరు మండల రైతాంగానికి ఈ ఆటోనగర్ చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. దశాబ్ద కాలంగా పరిష్కారం కాని కోవూరు షుగర్ ఫ్యాక్టరి రైతులు, కార్మికుల సమస్యను పది నెలల వ్యవధిలో పరిష్కారం చూపేందుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తెలియచేసారు. ఏపీఐఐసీ ద్వారా రోడ్లు, విద్యుత్తు, తాగునీరు లాంటి మౌలిక వసతులు కల్పించి రానున్న 2 నెలల్లో ఆటోనగర్ నిర్మాణం పూర్తి చేసి తానే ప్రారంభోత్సవం చేస్తానన్నారు. ఎన్నో సంవత్సరాల ఆటోనగర్ కల సాకారం అయిన సందర్భంగా బుచ్చిరెడ్డి పాళెం మెకానిక్ సోదరులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి, తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, బుచ్చి నగర పంచాయతి కౌన్సిలర్లు టిడిపి నాయకులు ఎంవి శేషయ్య, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మన్ పుట్టాసుబ్రమణ్యం నాయుడు, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విధులు బహిష్కరించిన మున్సిపల్ కార్మికులు

- కమీషనర్ నెల రోజులలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- అధికారుల హామీతో ఆందోళన విరమించిన కార్మికులు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులు మంగళవారం ఉదయం విధులు బహిష్కరించి 5:30 గంటల నుండి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని నిరసన ధర్నా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. ప్లకార్డులు మరియు సిఐటియు జెండాలు చేతపట్టు కొని మా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం విడనాడాలని, సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారీగా కార్మికులు కార్పొరేషన్ కార్యాలయంకు చేరుకోవడంతో కార్పొరేషన్ కార్యాలయం కార్మికులతో కిక్కిరిసి నినాదాలతో మారుమ్రోగింది. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసుల జోక్యంతో అడిషనల్ కమిషనర్ నందన్ కార్పొరేషన్ కార్యాలయం చేరుకొని యూనియన్ నాయకులు, కార్మికులతో సమస్యలపై చర్చ జరిపారు. అనంతరం కమిషనర్ సూర్యతేజతో ఆయన ఛాంబర్‌లో సమస్యలపై వివరంగా చర్చ జరిపి వివరించారు. సమస్యలు పరిష్కరించేందుకు నెలరోజులు గడువు ఇవ్వాలని అధికారులు కోరడంతో వారు ఇచ్చిన హామీతో కార్మికులు యూనియన్ నాయకులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు, సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేయుచున్న ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పలు దఫాలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. విధి లేని పరిస్థితుల్లో విధులు బహిష్కరించి ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడినదని అన్నారు. 60 సంవత్సరాలు నిండాయని నెపంతో 93 మంది కార్మికులను రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏ రకమైన సమాచారం లేకుండా నిర్దాక్షణ్యంగా పనిలో నుంచి ఆపివేయడం సరైన చర్య కాదని అన్నారు. చనిపోయిన కార్మికుల వారసులకు ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. చట్ట ప్రకారం అమలు చేయాల్సిన సెలవులు అమలు చేయడం లేదని ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. పనిముట్లు కార్మికుల జేబులో డబ్బులు నుండి కొనుగోలు చేసుకోవడం విచారకరమని అన్నారు. బట్టలు సబ్బులు నూనెలు చెప్పులు గత మూడు సంవత్సరాల నుండి కార్మికులకు ఇవ్వడం లేదని అన్నారు. మహిళలకు పూడికలు తీయడం, ట్రాక్టర్లకు ఎక్కించడం లాంటి పనులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రావిడెంట్ ఫండ్ ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ వర్తించని కార్మికులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే నిరవధిక ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, రూరల్ కార్యదర్శి కే.పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో అవినీతి

- ఆగ్రహించిన పీడీ గంగాభవాని
- ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ సస్పెండ్



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** వరికుంటపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023 -24 సంవత్సరంలో చేపట్టిన పనులపై 16వ విడత సామాజిక పనికి ప్రజా వేదిక సోమవారం పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. 2023-24 సంవత్సరంలో మండలంలోని 24 గ్రామపంచాయతీలలో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. గ్రామాలలో తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మాస్టర్లపై సంబంధిత అధికారుల రోల్ కాల్ చేయకపోవడం, కొలతలలో తేడాలు, మాస్టర్‌లో కూలీలు సంతకాలు, హాజరు లేకుండా వేతనాలు చెల్లింపు, పని ప్రదేశంలో తేడాలు వంటి తప్పిదాలపై వివిధ పంచాయతీల్లో మస్టర్ కొలతలలో తేడాలు చూపించి 11,18,776 రూపాయలు నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. ఉపాధి హామీ పనులలో దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. తనిఖీల్లో అవినీతి వెలుగులోకి రావడంతో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ సస్పెండ్ చేశారు. తనిఖీల్లో అవినీతి వెలుగులోకి రావడంతో సిబ్బంది తీరుపై పీడీ గంగ భవాని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డీఓ విజయలక్ష్మి, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఆజం ఖాన్, ఎస్ఆర్పిలు, డిఆర్పిలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ అధికారులతో రూరల్ ఎమ్మెల్యే సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో పొదలకూరు రోడ్డు అభివృద్ధి పనులపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నగర కమిషనర్ సూర్యతేజ, వివిధ శాఖల అధికారులతో మంగళవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూర్యతేజతో కలసి ఆర్ అండ్ బి, కార్పొరేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులతో పొదలకూరు రోడ్డు అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా సమీక్షించి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని, అదేవిధంగా వివిధ శాఖల అధికారులు ఎవరి బాధ్యత వారు తీసుకోవాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. పొదలకూరు రోడ్డు అభివృద్ధి పనులకు కమిషనర్ సూర్యతేజ చూపుతున్న చొరవ ఇస్తున్న సహకారం అద్భుతం అని కమిషనర్ సూర్యతేజని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వవాహనంపై వేణుగోపాలుడు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామి వారికి పేట ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామి వారిని అశ్వవాహనంపై పేట ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థాన అర్చకులచే కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. స్వామివారి ఊరేగింపులో మహిళల కోలాట నృత్యాలు చేస్తూ అలరించారు. చైర్మన్ చంద్రమౌళి రెడ్డి, సహాయక కమిషనర్, కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.